క్లుప్తంగా

బెల్టు షాపులు మూసివేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులను తక్షణమే మూసివేయాలని మాజీ ఎంపీటీసీ మూరగుండ్ల లక్ష్మయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏఓ సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బెల్ట్ షాపులు గ్రామాల్లో, పట్టణాలలో కిరాణా షాపుల మాదిరిగా వెలిశాయని తెలిపారు. వాటిని వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. వైన్ షాపులలో కూడా మందు అధిక రేట్లకు అమ్ముతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తొట్ల ప్రభాకర్, బూర వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి రాము తదితరులు పాల్గొన్నారు.

కో ఆప్షన్ పదవికి రాజీనామా



ఎంపీడీఓ ఇందిరకు రాజీనామా పత్రం అందజేస్తున్న మండల కో ఆప్షన్ మెంబర్

నూతనకల్ : మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ మహ్మద్ అలీఅబ్బాస్ తన పదవికి రాజీనామా చేశారు. శుక్రవారం ఎంపీడీఓ ఇందిరకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మండల పరిషత్‌లో ప్రొటోకాల్ పాటించకపోవడం తదితర కారణాల వల్ల పదవిలో కొనసాగదలచుకోలేదని తెలిపారు. ప్రాధాన్యత లభించని పదవి అవసరం లేదని రాజీనామా చేసినట్లు తెలిపారు.

నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

సూర్యాపేట : సూర్యాపేట పట్టణానికి నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 20, 21తేదీల్లో పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి శుక్రవారం తెలిపారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని పట్టణ ప్రజలకు సూచించారు.

అండర్‌పాస్ ఏర్పాటుకు సర్వే



జాజిరెడ్డిగూడెంలో హైవేపై సర్వే చేస్తున్న డీఈఈ బాలునాయక్

అర్వపల్లి : 365 జాతీయ రహదారిపై జాజిరెడ్డి గూడెంలోకి వెళ్లే దారి వద్ద, జాజిరెడ్డిగూడెం నుంచి కొత్తగూడెం వెళ్లే జాతీయ రహదారిపై రెండు చోట్ల అండర్ పాస్ బ్రిడ్జిల ఏర్పాటుకై శుక్రవారం జాతీయ రహదారుల విభాగం డీఈఈ ధరావత్ బాలునాయక్ సర్వే నిర్వహించారు. ఈ రెండు ప్రాంతాల్లో అండర్ పాస్ బ్రిడ్జిలు లేక తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని గతంలో గ్రామస్తులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో అధికారులు సర్వే జరిపారు. ఏయే ప్రాంతాల్లో బ్రిడ్జిలు నిర్మించాలనే విషయమై పరిశీలించారు. మరో విడత సర్వే జరిపి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు బాలునాయక్ చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, శిగ నసీర్‌గౌడ్, నర్సింగ లింగయ్య, ఆకుల మహేష్, పసుపులేటి సందీప్, మాదగాని రమేష్, మొగలబోయిన శేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడం హర్షణీయం

మద్దిరాల : ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ టికెట్‌ను ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు ఇవ్వడం హర్షణీయమని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కూజ ఏల్లేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోడికుమార్, పశుల అశోక్‌యాదవ్, మల్లం సతీష్, ముక్కాల నాగరాజు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

మద్దిరాల: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని డీపీఓ యాదయ్య అన్నారు. జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన పలువురు స్థానిక సమస్యలపై గ్రీవెన్స్ డేలో ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో శుక్రవారం ఆయన గ్రామంలో పర్యటించారు. పలు వీధులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ రాజేష్, పంచాయతీ కార్యదర్శి తరుణ్, ఉపసర్పంచ్ మురారి జనార్దన్, ఉబ్బని వెంకన్న, పగిళ్ల వెంకన్న, మిట్టకోల వెంకన్న, నిమ్మ రాములు తదితరులు ఉన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న డీపీఓ

చి'వరి'కి సాగునీరు అందేనా..

- గోదావరి జలాలపై ఆధారపడి పంటలు సాగుచేసిన రైతుల ఆవేదన
- వారబందీ విధానం నిలిపి.. నిరంతరం ఇవ్వాలని వేడుకోలు

అర్వపల్లి : ప్రస్తుత యాసంగి సీజన్‌కుగాను గోదావరి జలాలను మొదటి విడత విడుదల చేశారు. ఈసారి ఆరు తడులలో నీటిని వదలనుండగా.. మొదటి విడతలో ఈ నెల 8 నుంచి 17 వరకు నీటిని వదిలారు. మళ్లీ ఈనెల 23 నుంచి 30 వరకు వారబందీ విధానంలో రెండవ విడత నీటిని వదలనున్నారు. అయితే ఈసారి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, లోయర్ మానేరు డ్యాంలలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున చివరి భూములకు నీటిని అందించలేమని.. ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలని అధికారులు సూచించారు. కానీ రైతులు మాత్రం తమ భూములు ఆరుతడి పంటలకు యోగ్యంగా లేవని వరినే సాగుచేస్తున్నారు.



71 డీబీఎంలో నిలిచిపోయిన నీళ్లు

1.40లక్షల ఎకరాల ఆయకట్టు..

తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి, తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం, నాగారం, నూతనకల్, మద్దిరాల మండలాల్లో ఎస్సారెస్పీ రెండవ దశ కింద సుమారు 1.40లక్షల ఆయకట్టు సాగవుతుంది. కొద్ది మంది రైతులకు మాత్రమే బోర్లు ఉన్నాయి. మిగిలిన రైతులందరు గోదావరి జలాలపై ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. అయితే ఇప్పటికే సుమారు 80వేల ఎకరాలకు పైగానే వరి నార్లు వేసినట్లు అధికారులు చెబుతున్నారు.



అర్వపల్లి శివారులో దున్నిన వరిపొలం

ఇంకా రైతులు వరి సాగు చేయడానికి పొలాలు దున్నే పనిలో ఉన్నారు. కాగా గత సీజన్‌లో రోజుకు 2500 క్యూసెక్కుల వరకు నీటిని రెండో దశకు వదలగా ఈసారి మొదటి విడతలో 1800 క్యూసెక్కులు మాత్రమే వదిలారు. ప్రాజెక్టులలో నీరు తక్కువగా ఉన్నందున తాము ఏమిచేయలేమని అధికారులు చెబుతున్నారు. వారబందీ విధానం కాకుండా మార్చి వరకు పంటలకు రెగ్యులర్‌గా నీటిని వదలాలని రైతులు కోరుతున్నారు.

రెగ్యులర్‌గా నీటిని వదలాలి



ఈ సీజన్‌కు గోదావరి జలాలను తక్కువగా ఇస్తున్నందున వారబందీ విధానం కాకుండా రెగ్యులర్‌గా నీటిని వదలాలి. తక్కువ నీరు కారణంగా చెరువులు, కుంటలకు జలాలు రావడం లేదు. నీటిని పెంచితేనే పంటలకు నీళ్లు అందనున్నాయి. నీటిని పెంచి పంటలను కాపాడాలి.

– సుంకరి వెంకన్న, రైతు, సీతారాంపురం

నీళ్లు తక్కువగా ఉన్నాయి



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, లోయర్‌మానేర్ డ్యాంలలో నీళ్లు తక్కువగా ఉన్నందున ఈసారి రెండోదశకు ఎక్కువ నీటిని వదలలేని పరిస్థితి ఏర్పడింది. వరిపంటలకు సరిపోను నీళ్లు వచ్చే పరిస్థితి లేనందున ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలి. వారబందీ విధానంలో మార్చి 30 వరకు నీటిని వదలనున్నాం. అలాగే మరో 5 తడులలో నీటిని అందిస్తాం. రైతులు పరిస్థితిని అర్థం చేసుకొని నీటిని పొదుపుగా వాడుకోవాలి.

– ఎం. సత్యనారాయణ, బయ్యన్నవాగు డీఈఈ

క్రషర్ నిర్వహణపై అధికారుల విచారణ



ఆత్మకూరు గుట్ట వద్ద విచారణ చేస్తున్న అధికారులు

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని పెద్దగుట్ట వద్ద నిర్వహిస్తున్న కేఎస్ఎన్ఆర్ స్టోన్ క్రషర్ నిర్వహణ, బ్లాస్టింగ్‌లపై శుక్రవారం అధికారులు విచారణ చేపట్టారు. ఈ గుట్టపై జరుగుతున్న బ్లాస్టింగ్‌ల కారణంగా ఇళ్లు, బోర్లు దెబ్బతింటున్నాయని ఆత్మకూరు, నెమ్మికల్ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పలు శాఖల అధికారులు పెద్దగుట్ట, స్టోన్ క్రషర్ వద్ద విచారణ చేపట్టారు. ప్రధానంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు పెద్దగుట్ట పరిసరాలను పరిశీలించి కొంతమంది రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అలాగే క్రషర్ నిర్వహణ ప్రాంతంలో ప్రభుత్వ భూమి ఉందని ఫిర్యాదు రావడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఇన్‌చార్జ్ ఆర్డీఓ కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామస్తులు, రైతుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. ఈ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. మైనింగ్ ఏడీ వెంకటరమణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టగా గుట్ట సర్వే నంబర్ తప్పుగా నమోదైనట్లు తేలిందని తెలిపారు. విచారణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో ఎస్ఐ కట్టె వెంకటరెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మొక్కలను సంరక్షించాలి



కాసర్లపహాడ్‌లో రోడ్డు వెంట మొక్కలకు నీళ్లు పోయిస్తున్న కార్యదర్శి శ్రీనివాసరాజు

అర్వపల్లి : తెలంగాణకు హరితహారంలో నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని ఎంపీఓ సందీప్‌కుమార్ కోరారు. శుక్రవారం మండల వ్యాప్తంగా పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలలో వాటరింగ్ డే నిర్వహించారు. ప్రకృతి వనాలు, నర్సరీలు, రోడ్లవెంట నాటిన మొక్కలకు పంచాయతీ కార్యదర్శులు నీళ్లు పోయించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న ఆర్డీఆర్

భానుపురి : టీఎస్ ఈఈయూ–327 ఐఎన్‌టీయూసీ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, మల్లేష్, సత్తయ్య పాల్గొన్నారు.

తిరుమలగిరి : తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్లను శుక్రవారం తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాందాస్ నాయక్, బిచ్చునాయక్, వెంకటేశ్వర్లు, సుందర్, వెంకట్, దేవా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు జి.సోమాని నాయక్ మాట్లాడారు. బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ విస్తరణకు అందరూ సహకరించి, తమ హక్కులు కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్ నాయక్, ఎంపీఓ సంజీవ, ఎంఈఓ పి.ధారాసింగ్, ఆత్మకూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు డి.శంకర్‌నాయక్, జిల్లా కార్యదర్శులు డి.రఘుపతినాయక్, రవీందర్‌నాయక్, పి.శివమూర్తి, చందునాయక్, వెంక్యనాయక్, గౌతం తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బంజారా ఉద్యోగ సంఘం నాయకులు



ఆత్మకూరులో..

ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తాం

- తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి : ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని తప్పకుండా అమలుచేస్తామని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. తనను ఉద్యకారుడిగా గుర్తించి ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చి గెలిపించినందుకు జీవితాంతం కాంగ్రెస్‌పార్టీకి రుణపడి ఉంటానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు కాకముందే ప్రభుత్వం కూలిపోతుందని బీఆర్ఎస్ నాయకులు శాపనార్థాలు పెట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత బిడ్డగా తనకు నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉందని, నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులు చేయిస్తానన్నారు. ఎస్సారెస్పీ కాలువలను నిర్మించిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. ఈ నెల 23 నుంచి ఎస్సారెస్పీ నీళ్లు విడుదల చేస్తామని, రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలన్నారు. రాష్ట్ర మంత్రులను తీసుకొచ్చి తుంగతుర్తిలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులపై ఇంటింటి సర్వే చేసి అర్హులను గుర్తించి పథకాలు అందిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపిందన్నారు. త్వరలో ప్రభుత్వం 7000లకుపైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీఓ భీంసింగ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్



తిరుమలగిరిలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అధికారులు సమన్వయంతో పని చేయాలి

తిరుమలగిరి : వివిధ శాఖలకు నిర్దయించిన లక్ష్యాలను చేరుకునే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ కోరారు. శుక్రవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాస గృహంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని, నూతనంగా చేయాల్సిన పనులను గుర్తించాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, వాటిని వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశించారు. కొత్త రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ విజయ్‌కుమార్, డీఈ సత్యనారాయణ, పీఆర్ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ కొండయ్య, ఏఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నూతనకల్ : ఇటీవల పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన నాగం జయసుధసుధాకర్‌రెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే మందుల సామేల్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తన ఎన్నిక కోసం సహకరించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు యాస జనతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెనూ పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే భోజనం మెనూ పాటించాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట మండల పరిషత్ కార్యాలయంలో వసతి గృహాల అధికారులకు నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వసతి గృహాల్లో ఉండే బాల బాలికలకు అన్ని సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మంచి రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల అధికారులు హుస్సేన్, నాగేందర్, గిరిధర్‌రెడ్డి, ఇందిర, శ్రీదేవి, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



తుంగతుర్తి : కర్విరాలలో సంక్షేమ పథకాల క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న వైద్యసిబ్బంది



నాగారం : లక్ష్మాపురంలో..

తుంగతుర్తి : మండల పరిధిలోని కర్విరాల, అన్నారం గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది సోమయ్య, నాగమణి, రజిత, ఆశలు కొమరమ్మ, సైదమ్మ, రమ, నీలమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని లక్ష్మాపురం, శాంతినగర్ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై బ్యాంకు, వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలు, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, ఆరోగ్యశ్రీ తదితర పథకాలపై ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రజలకు టీబీ, బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ అనంత్ గుప్తా, డాక్టర్లు విజయ్, శ్రావణ్‌కుమార్, ఏఎన్ఎం స్వప్న, ఆశా కార్యకర్త మల్లెపాక శోభారాణి, వార్డ్ సభ్యులు శాగంటి భాగ్యమ్మ, మల్లెపాక సోమలక్ష్మి, వెంకన్న, సైదులు, యాకయ్య, శాగంటి సోమయ్య, అంజయ్య, రాంమూర్తి, నరహరి, భిక్షం, మల్లయ్య, వీరసోములు, కెనరా బ్యాంక్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



చివ్వెంల : బహుమతులు అందజేస్తున్న దాతలు



అర్వపల్లి : పర్సాయపల్లిలో..

చివ్వెంల : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బి.చందుపట్ల గ్రామంలో చైతన్య యువజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిని అక్కలదేవిగూడెం గ్రామం జట్టు, ద్వితీయ బహుమతిని బి.చందుపట్ల జట్టు, తృతీయ బహుమతిని సూర్యాపేట జట్టు గెలుపొందాయి. ఈ సందర్భంగా దాతలు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పొదిల ప్రదీప్ కుమార్, చైతన్య యువజన మండలి గౌరవ అధ్యక్షుడు అనంతుల మధు, షేక్ రహమత్ పాషా, భాష్పంగు సునీల్, కోలికపంగు వాసు పాల్గొన్నారు.

క్రీడలు సోదరభావం పెంపొందిస్తాయి

అర్వపల్లి : క్రీడలు సోదరభావం పెంపొందిస్తాయని ప్రొఫెసర్ పీవై రమేష్ అన్నారు. పర్సాయపల్లిలో సంక్రాంతి సందర్భంగా పందిరి సురేష్, శ్రీను, పరశురాం మెమోరియల్ పేరిట నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు శుక్రవారం షీల్డులు, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పందిరి యుగంధర్, ఆకాంక్ష, రాఖీ, శేఖర్ రెడ్డి, మిత్రమండలి సభ్యులు బానోతు హుస్సేన్, రమేష్, ఎం.సందీప్, పుప్పాల నర్సింహ, ఏకస్వామి, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న దామోదర్

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు క్రీడా దుస్తులను సద్వినియోగం చేసుకోవాలని టెక్నో డీడ్ ఐటీ కంపెనీ చైర్మన్ వంగూరి దామోదర్ అన్నారు. శుక్రవారం ఈటూరు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు రూ.70వేల విలువ గల క్రీడా దుస్తులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. అనంతరం వంగూరి దామోదర్‌ను పాఠశాల సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేరాల సరితయాదగిరి, ఉపసర్పంచ్ రాంపల్లి సోమన్న, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ కె.యాదగిరి, ప్రధానోపాధ్యాయుడు వాసం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, పసుపులేటి వెంకట్‌రెడ్డి, కన్నెబోయిన వెంకటభిక్షం, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు



అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

అర్వపల్లి : అయోధ్యలో ఈనెల 22న జరిగే రామ మందిరం ప్రారంభోత్సవం, శ్రీరాముడి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాలను పురస్కరించుకొని అయోధ్య నుంచి వచ్చిన రాముడి అక్షింతలను శుక్రవారం పడమటితండా, తిమ్మాపురంస్టేజీ, తిమ్మాపురం గ్రామాల్లో భక్తులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ప్రతిష్ఠ రోజు ఇంటింటికీ దీపాలు వెలిగించి పూజలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కందుల అనితాదేవి, సూర్యాపేట సాయిసేవా సంస్థ సభ్యులు ఉప్పల రాజేష్, నాగేందర్, రాంబాబు, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, రాఖేష్, సందీప్, వేణు, కృష్ణమూర్తి, సత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని పాతర్లపహాడ్‌లోని ఆశకార్యకర్త ఆరెంపుల అంజమ్మ భర్త జానయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో పలువురు వైద్యసిబ్బంది శుక్రవారం అంజమ్మకు రూ.10,000 ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమ్యతేజ, సూపర్‌వైజర్ రంగమ్మ, ఏఎన్ఎం విజయశ్రీ, ఆశాలు సత్యవతి, లలిత, సైదమ్మ, సుజాత పాల్గొన్నారు.

బీసీలకు కేటాయించాలి

నూతనకల్ : భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని బీసీలకు కేటాయించాలని బీఆర్ఎస్ మండల బీసీ సంఘం అధ్యక్షుడు జటంగి సతీష్ యాదవ్ కోరారు. శుక్రవారం నూతనకల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దూదిమెట్ల బాలరాజు యాదవ్‌ను బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించాలని అన్నారు. కార్యక్రమంలో ఉప్పుల వీరయాదవ్, ఎల్లెంల పరమేష్, భూతం ప్రశాంత్, బెజ్జంకి సతీష్, చెవగాని శ్రీనుగౌడ్, నవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సతీష్ యాదవ్

ప్రత్యేక ఓటరు సవరణను సద్వినియోగం చేసుకోవాలి

అర్వపల్లి : శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు జాజిరెడ్డిగూడెం మండలంలోని 32 పోలింగ్ కేంద్రాల్లో జరిగే ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు నూతన ఓటరుగా నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే సవరణల కోసం కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. శని, ఆదివారాల్లో బీఎల్ఓలు బూత్‌లలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వ్యక్తి 'అద్దంకి'

తిరుమలగిరి : కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడ్డ వ్యక్తి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అని తిరుమలగిరి మున్సిపాలిటీ మాల మహానాడు అధ్యక్షుడు గంట లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తుంగతుర్తి అసెంబ్లీ టికెట్ త్యాగం చేసిన అద్దంకి దయాకర్‌కు ప్రభుత్వం వెంటనే తగిన పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు గంట సందీప్, కార్యదర్శి వరుణ్‌కుమార్, సంపత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాకే ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

నూతనకల్ : రాష్ట్రంలో కులగణన చేపట్టిన తర్వాతనే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీసీ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 22శాతం ఉన్న రిజర్వేషన్లను 47శాతానికి పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు బ్రహ్మాండ్లపల్లి భవాని శంకర్, బొల్కా కొమరయ్య, ఉప్పల లింగరాజు, మధు, చామకూరి రమేష్, బొల్కా మల్లయ్య, గురులింగం, సైదులు, నాగయ్య పాల్గొన్నారు.

కంది పంటలో చీడపీడలపై అవగాహన



కంది సాగుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త ఆదర్శ్

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని సింగారెడ్డిపాలెంలో సాగులో ఉన్న కంది పంటను మల్లారెడ్డి యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులతో కలిసి శుక్రవారం సందర్శించినట్లు కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కంది పంట పూత, కాయ దశలో ఉందని తెలిపారు. కంది చేనులో మారుకా మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగు, ఈగ ఆశించినట్లు తెలిపారు. ఈ పురుగుల కారణంగా పంట నష్టపోయే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థులు అభిరామ్, దినేష్, నితిన్, సందీప్, మహేష్, మురళీ, శరత్ తదితరులు పాల్గొన్నారు.